క్లుప్తంగా

కంటి వెలుగును విజయవంతం చేయాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు కోరారు. బుధవారం మణుగూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నర్సింహారావు మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీ నుంచి కంటి వెలుగు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానుండగా.. విజయవంతంతో మండలాన్ని ముందంజలో నిలపాలన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వీరబాబు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతి

చండ్రుగొండ: సీపీఎం జిల్లా నాయకుడు వంకాయలపాటి శ్రీనివాసరావు(65) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. శ్రీనివాసరావుకు భార్య కృష్ణకుమారి, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన స్వగ్రామమైన తుంగారంలో అంత్యక్రియలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కొక్కెరపాటి పుల్లయ్య, మండల నాయకులతోపాటు జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, రైతుబంధు జిల్లా సమన్వకర్త అంకిరెడ్డి కృష్ణారెడ్డి, టీఆర్ఎస్, సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, ఎన్డీ పార్టీల నాయకులు శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలని ఆందోళన

అశ్వారావుపేటరూరల్: అర్హులైన నిరుపేదలకు తక్షణమే ప్రభుత్వం డబుల్ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యుడు గోగినపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సుచరితకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొంది లక్ష్మణ్‌రావు, కంగాల భూలక్ష్మి, కుంజా లక్ష్మి, ఉప సర్పంచ్ మడకం దుర్గారావు, పార్టీ నాయకులు కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, మడకం దుర్గారావు, రాంబాబు, భీమయ్య, వెంకన్నబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని..

భద్రాచలంటౌన్: ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రంను ఆర్డీఓ రత్న కల్యాణికి అందజేశారు. అనంతరం ఆల్ పెన్షనర్స్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆర్డీఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, నారాయణ, కృష్ణమూర్తి, మంగయ్య, సుబ్బయ్య, సత్యనారాయణ, ఐలయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధిద్దాం


భద్రాచలంటౌన్: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలు కలిసికట్టుగా ఉండడంతో రాజ్యాధికారాన్ని సాధించవచ్చన్ని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. స్వరాజ్య పాదయాత్ర 10 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకుని భద్రాచలం చేరుకున్న సందర్భంగా డీఎస్పీ జెండా దిమ్మె, శిలాఫలకాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్యమే వస్తే ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఎస్సీలను ఏజెన్సీ ఎస్సీలుగా గుర్తిస్తామని, వారికి ప్రత్యేక వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, మధు, వేణు, రాంబాబు, స్వామి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

మణుగూరుటౌన్: మణుగూరు మండల వాసవీక్లబ్, వనితాక్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కిన్నెర కల్యాణ మండపంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ముగ్గులను పరిశీలించి ఉత్తమమైన వాటిని బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రిజనల్ చైర్ పర్సన్ చిత్తలూరి రమేష్‌బాబు, ప్రెసిడెంట్ చిట్టూరి శేషుకుమార్, జోన్ చైర్ పర్సన్ దింటకుర్తి బ్రహ్మయ్య, పీఆర్ఓ విశ్వనాథంగుప్తా, డిస్టిక్ సీజీఎఫ్ ఇన్‌చార్జ్ బందారు నర్సింహారావు, వనితా వైభవం ప్రెసిడెంట్ నాగరత్నమణి,రిజినల్ సెక్రటరీ ఉమా, కన్నా రాకేష్, వాసా ప్రసాద్, ఇందుమతి, ధనలక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

జీర్ణకోశ వ్యాధుల విజృంభణ

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- జీవనశైలి మార్పులే కారణం
- సరైన అవగాహనతో ఫలితం



భద్రాచలంఅర్బన్: పాశ్చాత్య ఆహారశైలికి అలవాటు పడడంతో అనేక మంది నేడు జీర్ణకోశ సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. అర్ధరాత్రుల వరకు విధులు నిర్వహిస్తూ వేళాపాళా లేకుండా ఆహారం తీసుకుంటూ సరిపడా నిద్ర లేకపోవడంతో అనేక మంది నేడు జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. కామెర్లు, హైపటైటీస్ బీ వంటి కాలెయ సంబంధిత వాధులకు గురవుతున్నారు. వ్యాధులపై సరైన అవగాహన లేకపోవడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణతో పాటు మరో మూడు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్) నుంచి వైద్యం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు. వీరిలో నెలకి 90 శాతం గ్యాస్ట్రిక్ సమస్యల బాధతోనే తమన సంప్రదిస్తున్నారని వైద్యులు పెర్కొంటున్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉంటే జీర్ణ కోశ వ్యాధులను కట్టడి చేయవచ్చని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు వెల్లడిస్తున్నారు.

ఛాతిలో మంటా?

అనేక మంది ఆధునిక జీవన శైలి వల్ల నేడు ఛాతిలో మంట సమస్యతో బాధపడుతూ గుండె జబ్బు అనుకుని భయపడుతున్నారు. శారీరక బరువు ఎక్కువగా ఉండి, ఏదైనా ఆహారం తినగానే తేపులు, ఛాతిలో మంట వస్తుంటే అది గ్యాస్ వల్ల కూడా రావచ్చు. పొట్టలో నొప్పి, ఛాతీలో మంట సమస్యకు నెలల తరబడి మాత్రలు వాడకూడదు. రెండు వారాలు మందులు వాడి తగ్గకపోతే గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును సంప్రదించి గ్యాస్ట్రోస్కోపి చేయించుకోవాలి.

నడకతో వ్యాధులకు చెక్..

యాంత్రిక జీవనానికి అలవాటు పడి అనేక మంది శారీరక వ్యాయామాన్ని మరిచిపోవడం వల్ల గ్యాస్ట్రో ఎంట్రాలజీ సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. బరువు ఎక్కువగా ఉండి, వ్యాయామం తక్కువ చేయడం వల్ల లివర్‌లో కొవ్వు చేరే ప్రమాదం ఉంది. మద్యం ఎక్కువగా సేవించేవారికి వచ్చే లివర్ జబ్బులన్నీ కూడా వ్యాయామం చేయని సాధారణ వ్యక్తులకు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణ కోసం ప్రతిరోజూ ఎక్కువ సేపు నడవడం మంచిది.

పది మందిలో ఇద్దరు..



లివర్, జీర్ణకోశ వ్యాధులపై ప్రజలకు అనేక అపోహలు ఉన్నాయి. అవగాహన లేకపోవడం వల్ల అనేక మంది ప్రాథమిక దశలో వ్యాధులను గుర్తించక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజూ భద్రాచలం ఏరియా ఆస్పత్రి పరీక్షల కోసం వచ్చే వారిలో కనీసం పది మందిలో ఇద్దరు గ్యాస్ట్రిక్ సమస్యతో బాధతో వస్తున్నారు.

– డాక్టర్ కిషన్, ఇంటెన్సివిస్ట్, ఏరియా ఆస్పత్రి

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబెల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి సురేష్ కుటుంబానికి భద్రాచలం శాసనసభ్యుడు పోదెం వీరయ్య సిఫార్సు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద వచ్చిన 28,500 రూపాయల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా సురేష్‌కు బుధవారం అందజేశారు.

అలాగే మండలంలోని చింతగుప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని పలు సమస్యలపై గ్రామస్తులతో కలిసి ఐటీడీఏ పీఓను కలిసి ఎమ్మెల్యే వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉబ్బా వేణు, జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవా,చింతగుప్ప సర్పంచ్ కట్టం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ, పంపిణీ

భద్రాచలం: టీఎస్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఐటీడీఏ డీడీ రమాదేవి ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏటీడీఓ నర్సింగరావు, సంఘ నాయకులు సర్వేశ్వర్ దొర,శంకర్, గోవింద్, మదర్ నాయక్, గడ్డం నాగేశ్వరరావు, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: టీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఆశ్రమ పాఠశాల ఆవరణలో బుధవారం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలవత్ హరిబాబు, సంఘం బాధ్యులు ఆర్.రాందాస్, ఇస్లావత్ రమేష్, ఐటీడీఏ వింగ్ కన్వీనర్ గంగావత్ చిట్టిబాబు, హెచ్ఎం సునీత పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ 2023 క్యాలెండర్‌ను ఎంపీడీఓ చంద్రమౌళి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీ బోడెబోయిన జయబాబు మాట్లాడారు. ఏటీయఫ్ దుమ్ముగూడెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ పూసం విఠల్ బాబు,కారం వెంకటేష్, పర్శిక రమేష్, జిల్లా ప్రచార కార్యదర్శి పర్శిక నాగేశ్వరరావు, నర్సింహమూర్తి, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆటలు సాగనివ్వం..



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గంలో బీజేపీ ఆటలు సాగనివ్వబోమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం ములకపాడు పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంధన, నిత్యావసరాల ధరలు బీజేపీ అధికారంలోకి వచ్చాకే పెరిగాయని గుర్తు చేశారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎం కేసీఆర్ పోడు సమస్యపై స్పష్టమైన వైఖరిని తెలిపాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు కోర్స చిలకమ్మ, మర్మం చంద్రయ్య, నాయకులు కొడాలి లోకేష్ బాబు, కాక కృష్ణ, మహమ్మద్ బేగ్, బొల్లి సత్యనారాయణ, తోడం తిరుపతిరావు, గుడ్ల రామ్మోహన్ రెడ్డి, పెనుబలి ప్రసాద్, కొమరం రాముడు, మడకం మహేంద్రనాథ్, గట్టుపల్లి వెంకటేశ్వర్లు, కోడి వీరస్వామి పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసిక ఉల్లాసం



అశ్వారావుపేటరూరల్: పావురాన్ని వదులుతున్న బెటాలియన్ కమాండెంట్ జమిల్ బాషా

అశ్వారావుపేటరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, శరీరక దృఢత్వానికి ఎంతో మేలు చేస్తాయని సత్తుపల్లి(గంగారం) 15వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా అన్నారు. మండల పరిధిలోని మద్దికొండ(భీమునిగూడెం) గ్రామంలో బుధవారం ఆయన సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఏర్పాటు చేసిన నారం వెంకటేష్ మెమోరియల్ అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ దళాధిపతులు ఆర్ నాగేశ్వరరావు, ఎ.నరసింహా, బెటాలియన్ పరిపాలన అధికారి కె.సమ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కాసాని దుర్గ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తాటి నాగార్జున, లకావత్ సత్యనారాయణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

అశ్వాపురం: క్రీడల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల కేంద్రంలో కొమరంభీం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రారంభించారు. తొలుత కొమరం భీం చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంరం బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రేగా మాట్లాడారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, సర్పంచ్‌లు పర్శిక సూరిబాబు, కలేటి నరసింహారావు, పాయం భద్రయ్య, ఎంపీటీసీ ఏనిక రవి, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గజ్జల లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు కందుల కృష్ణార్జున్‌రావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు, క్రీడాకారులు, కొమరం భీం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు క్రీడలు అవసరం

గుండాల: మారుమూల ప్రాంతాలలోని యువతకు క్రీడలు చాలా అవసరమని క్రీడల్లో ప్రతిభను చాటుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అన్నారు. ఫారెస్టు అధికారి శ్రీనివాస్‌రావు జ్ఞాపకార్థంగా కాచనపల్లిలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌లో బుధవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాపలగడ్డ, కాచనపల్లి రేంజ్‌లో ముత్తాపురం జట్లు డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు రేంజర్‌లు మురళి, దీపికలు తెలిపారు. విజేతలను ఫారెస్టు సిబ్బంది అభినందించారు. డీఆర్ఓ, సెక్షన్, బీట్ ఆఫీసర్లు బాలాజీ, జాహెదా బేగం, సుక్కి, హనుమంతు, మురళి,శాంతి, సతీష్, వెంకన్న పాల్గొన్నారు.

కూడారై ఉత్సవం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కూడారై ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో 108 కలశాలలో ప్రసాదాలు, నైవేద్యం పెట్టి మహిళలు పూజలు చేశారు. ఆలయ పూజారి బోడెం వెంకన్నశాస్త్రి ఆధ్వర్యంలో ఉత్సవం సాగింది.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏరియా హస్పిటల్ అడ్డా ఆటో యూనియన్ నూతన కమిటీని ఏరియా హస్పిటల్ ఆవరణలో జరిగిన సమావేశంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఘంటసాల సతీష్, కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యాక్షుడిగా రాము, జాయింట్ సెక్రెటరీగా నగేష్, కోశాధికారిగా రమేష్‌లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముత్యాలరావు, మంగరావు, శ్రీను పాల్గొన్నారు.

అమానుష చర్య

బూర్గంపాడు: గోదావరి వరద బాధితుల గుడారాలను అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా తొలగించటం అమానుషమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నం చంద్ ఆరోపించారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని శాంతియుతంగా 150 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్న వరద బాధితులపై అటవీశాఖ అధికారుల దాడులు అప్రజాస్వామికమని తెలిపారు. దాడులకు పాల్పడిన అటవీశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

భూమిపూజ

ములకలపల్లి: మండలపరిధిలోని సీతాయిగూడెం జీపీ కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడీపీ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా బీఆర్ఎస్ పాలన సాగిస్తోందని అన్నారు. స్థానిక సర్పంచ్ కారం సుధీర్, ఎంపీటీసీ సున్నం సునిత, జీపీ కార్యదర్శి శివనారాయణ, బీఆర్ఎస్ నాయకులు కొండవీటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

దమ్మపేట: ప్రజ సంక్షేమ పథకాల అమలు విషయంలో నిరుపేదలకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి అమర్లపూడి రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని దమ్మపేట గ్రామ శివారు నుంచి స్థానిక తహసీల్ వరకు కార్యకర్తలతో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నాయకులు ఊకే అప్పారావు, దుర్గమ్మ, బండి ఆదినారాయణ, కొండ్రు లక్ష్మి, చాపా ముత్యాలరావు, వాడే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల విజయం

మణుగూరుటౌన్: సింగరేణి కార్మికుల 11వ వేతన ఒప్పందం బేసిక్‌పై 19శాతం సాధించుకోవడం కార్మికుల విజయం అని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. బుధవారం మణుగూరు పీకేఓసీలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా సాధించామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నేతలు ఎంవీ.రామనర్సయ్య, నజీరుద్దీన్‌బాబా, గోపిశెట్టి శివయ్య, ఆవుల నాగరాజు, సుదాకర్, రాజేశ్వరరావు, సాయి ప్రకాశ్, కార్తిక్, సురేష్, పరమేశ్వర్, కోటేశ్వరరావు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్సును ప్రారంభిస్తున్న ఆర్డీఓ రత్న కల్యాణి

భద్రాచలంటౌన్: ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ రత్న కల్యాణి అన్నారు. భద్రాచలం ఆర్టీసీ డిపోకి ప్రభుత్వం కేటాయించిన రెండు లగ్జరీ బస్సులను బుధవారం ఆమె డిపో ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ఆర్టీసీ సంస్థ ప్రయాణికులు సౌకర్యార్థం నూతన హంగులతో బస్సులను తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం ఆమె నూతనంగా ప్రారంభించిన బస్సులో కొది దూరం ప్రయాణం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.రామారావు, నాగేశ్వరరావు,వెంకన్న, వెంకటేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సమస్యలు పరిష్కరిస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కళాశాల 22వ వార్షికోత్సవం డీఐఈఓ సులోచనారాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలు వివరించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ.. కళాశాలను సర్వాంగసుందరగా తీర్చిదిద్దుతానని, సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం గత ఏడాది ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. తదుపరి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కళాశాల ఉపాధ్యాయ బృందం దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ వేశధారులతో విద్యార్థులు ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలుకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సర్పంచ్ బీబీనేని వీరభద్రం, ఎంపీపీ మట్ల నాగమణి, ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, తాటి తులసి, ఆర్జె తారాచంద్, ఎంపీఓ లక్ష్మయ్య, టీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోరంపూడి అప్పారావు, శనగపాటి అంజి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పలు పార్టీల నాయకుల అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తగూడెం పర్యటన సందర్భంగా బుధవారం పలు పార్టీలకు నాయకులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం పర్యటనలో ఏలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తుగా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన ఎనిమిది మంది నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

ములకలపల్లి: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పాల్వంచకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణ, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు సీనియర్ నాయకులు అరెస్టైన వారిలో ఉన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

భద్రాచలంఅర్బన్: సీఎం పర్యటన నేపథ్యంలో భద్రాచలంలో సీపీఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ఖండించారు. అరెస్ట్ చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.

అరెస్టులు సరికాదు..

బూర్గంపాడు: ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయటం పిరికిపంద చర్య అని మాజీ జెడ్పీటీసీ సభ్యులు బట్టా విజయ్‌గాంధీ విమర్శించారు. బుధవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా పోలీసులు అరెస్టులు చేశారన్నారు.

బాలికలకు సైకిళ్లు అందజేత



సైకిళ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి, తుక్కాని శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు హైస్కూల్‌లో ఇద్దరు బాలికలు, రామచంద్రాపురం పాఠశాలలో ముగ్గురు బాలికలు దూరం నుంచి పాఠశాలకు కాలినడకన వస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు, తమ సంఘం నాయకుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి చొరవతో తానా ఫౌండేషన్ వారికి సహకారమందించింది. ఫౌండేషన్ బాధ్యులు తాళ్లూరి జయశేఖర్ ఆర్థిక సహకారంతో ఆ బాలికలకు బుధవారం పాఠశాలల్లో సైకిళ్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు కోడి కృష్ణవేణి, కాకా అశోక్, తానా ప్రతినిధిగా తుక్కాని శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

బొమ్మలు, తినుబండారాలు..

కరకగూడెం: గ్రేస్ సర్వీస్ సొసైటీ, ఖమ్మం వారి ఆధ్వర్యంలో బుధవారం వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బట్టుపల్లి, కరకగూడెం, మోతె, అనంతారం, కొత్తగూడెం, తాటిగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 500 మంది నిరుపేద విద్యార్థులకు బియ్యం, గిఫ్ట్ ప్యాకెట్లు, తినుబండారాలు, బొమ్మలు ఆయా హెచ్ఎంల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సంస్థ ప్రతినిధులు మురళి, కృష్ణారెడ్డి, సైదులు, సతీష్ పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తున్న ఆదివాసీ పూజరులకు గౌరవ వేతనం ఐటీడీఏ ద్వారా ఇవ్వాలని, ఆదివాసీ పూజరులను గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. భద్రాచలం గిరిజన అభ్యుదయ భవన్ నందు ఆదివాసీ పూజారుల జిల్లా స్థాయి సదస్సు బుధవారం సున్నం గంగ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మీడియం మాట్లాడారు. అనంతరం ఆదివాసి పూజారుల సంఘం నూతన కన్వీనర్‌గా సున్నం గంగ కో-కన్వీనర్లుగా వజ్జా సురేష్, పూనెం వీరన్న, వాగే నరేష్, పూజారి నాగమణి, కుంజా విజయలను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వజ్జా సురేష్, సరియం కోటేశ్వరరావు, సున్నం గంగ, కుంజా శ్రీను, గౌరీ నాగేశ్వరావు, కల్తీ భారతి, మాడెం లక్ష్మి, కొండ్రు భద్రం, పాయం సుజాత, ఇర్ప రమేష్ పాల్గొన్నారు.

ఎస్వోటు జీఎంకు వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఓపెన్‌కాస్ట్ గనుల్లోని ఓబి వర్కర్లకు సింగరేణి ఉచిత వైద్యం కోసం మెడికల్ అటెండెన్స్ పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఇఫ్టు ఆధ్వర్యంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్ పాషా మాట్లాడుతూ.. సంక్రాంతి నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షులు మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అధ్వానంగా డ్రైయినేజీ



మండల కేంద్రంలో చవిటిగూడెం గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన డ్రైయినేజీ అధ్వానంగా మారింది. ఇక్కడి నీరు బయటకు పోకుండా నిల్వ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వృథా నీరు, మురికి నీరు ఇళ్ల ఎదుట డ్రైయినేజీలో ఎక్కడికక్కడే నిల్వ ఉండి చెత్తా చెదారం కుళ్లిపోతోంది. దీంతో దుర్వాసన వస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయి. డ్రైయినేజీ నీరు బయటకు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: కృష్ణచైతన్య, పంచాయితీ కార్యదర్శి
ఫోన్ నంబర్: 9949120483